## క్లుప్తంగా

### ఈస్ట్, వెస్ట్‌లలో 8 నామినేషన్లు దాఖలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి మంగళవారం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా షేక్ నూరి ఫాతిమా, అదే పార్టీ నుంచి షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా షేక్ దుర్రే షహవార్, షేక్ హరూన్ రషీద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పార్టీ తరఫున షేక్ అల్తాఫ్‌లు తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరికి నామినేషన్ పత్రాలు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సత్తెనపల్లి నరసింహారావు, గండికోట బాలాజీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరఫున టి. శంకరావు నామినేషన్ పత్రాలను పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మికి అందజేశారు.

### 'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు వేణుగోపాల్‌నగర్‌లోని శ్రీకోన బాలప్రభాకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శివకుమారి తెలిపారు. టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈసందర్భంగా శివకుమారి మాట్లాడుతూ పాఠశాల నుంచి పరీక్షలు రాసిన 116 మంది విద్యార్థుల్లో 108 మంది ఉత్తీర్ణులు కాగా, 93 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యాయుడు బి.హైమారావు మాట్లాడుతూ ప్రతి యేటా టెన్త్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా 571 మార్కులు సాధించిన బి.శైలజకు ఉపాధ్యాయుడు హైమారావు రూ.2వేల నగదు బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులు జె.రమాదేవి, జె.వి జయానంద్, కె.పద్మజ, కల్యాణి, తనూజ పాల్గొన్నారు.

### రజకులను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: టీడీపీ గుంటూరు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్ ప్రక్రియలో లౌడ్ స్పీకర్లలో రజకులను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జీఓ 38 ప్రకారం రజకులను చాకలి అని పిలిచిన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### వృద్ధుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాకేతపురంలో నివాసం ఉండే శివన్నారాయణ (70) ఈనెల 20వ తేదీ అనారోగ్య కారణలతో పురుగు మందు సేవించాడు. బంధువులు గుర్తించి అతనిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి నిందితుల ఇళ్లలో సోదాలు



గుంటూరు రూరల్: గంజాయి కేసుల్లో నిందితులై, అనుమానాస్పదంగా వ్యవహరించే వ్యక్తుల ఇళ్లలో నల్లపాడు సీఐ నరేశ్ కుమార్ సోదాలు జరిపారు. మంగళవారం రాత్రి స్వర్ణభారతినగర్, సమ్మర్‌పేట, అడవి తక్కెళ్ళపాడు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. నిషేధిత ఉత్ప్రేరకాలను విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను ఆయన సూచించారు.

# ఫలితాలనిస్తున్న విద్యా సంస్కరణలు

- ప్రభుత్వ చర్యలతోనే 'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు
- విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం జగనన్న
- రూ.వందల కోట్లతో సర్కారీ బడుల్లో మౌలిక వసతులు
- జగనన్నకు మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ఎంపీ అభ్యర్థి కిలారి, ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి 39, 42, 22 డివిజన్లలో ఎన్నికల ప్రచారం



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి రజని, ఎంపీ అభ్యర్థి రోశయ్య

పట్నంబజారు: విద్యా రంగంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 39, 42, 22 డివిజన్లలో మంత్రి విడదల రజిని, పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి మంగళవారం మనతో మన రజినమ్మ పేరుతో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు అద్భుతమైన ఫలితాలు సాధించాయని, విద్యారంగంలో జగనన్న ప్రవేశ పెట్టిన సంస్కరణలే అందుకు కారణం అని చెప్పారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం జగన్ ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి నాడు-నేడు ద్వారా అభివృద్ధికి నాంది పలికారన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని, విద్యా ప్రమాణాల పెంపునకు తగిన చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ ఐదేళ్లుగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్ఫలితాలు ఇచ్చాయని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్యా వ్యవస్థను పటిష్టం చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఏకంగా 582 మార్కులు సాధించటం సంతోషదాయకమన్నారు. ఇంతటి గొప్ప క్షణాలు తమ ప్రభుత్వంలోనే సాధ్యపడ్డాయని తెలిపారు.

**ఐదేళ్లలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి..**

విద్యతో పాటు వైద్య రంగంలో ప్రభుత్వం వినూత్న సంస్కరణలు తీసుకొచ్చిందని, కరోనా సమయంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా చేసిన సేవలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని మంత్రి రజిని చెప్పారు. ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి ముంగిటకు వైద్య సేవలు తీసుకురావడం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. వీటిలో ఇప్పటికే ఏకంగా 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్‌లను నిర్మిస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో వాటిలో చాలావరకు నిర్మాణం పూర్తయి వాటి ఫలితాలను ఈ రాష్ట్ర ప్రజలకు అందనున్నాయన్నారు.

**గుంటూరు ప్రజలు చైతన్య వంతులు: కిలారి రోశయ్య**

గుంటూరు నగర ప్రజలు చైతన్యవంతులని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఇక్కడి ప్రజలు నమ్మరని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గతంలో టీడీపీ ఎంపీగా గెలిచిన అభ్యర్థి కనిపించిన పాపాన పోలేదని, ఇప్పుడు మళ్లీ ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఎన్ఆర్ఐ వచ్చాడని, ఆయన్ని గెలిపిస్తే.. అతడిని చూసేందుకు వీసా, పాస్‌పోర్ట్ తీసుకోవాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. మంచే చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు.

**పశ్చిమంలో రజినమ్మ రాజ్యమే : ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్**

రానున్న ఎన్నికల్లో మంత్రి రజినమ్మ గెలుపు తథ్యమని.. పశ్చిమంలో రజినమ్మ రాజ్యం చూడబోతున్నామని పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త అలుపెరుగని సైనికుడై.. రానున్న ఎన్నికల పోరాటానికి సిద్ధ పడాలని విజ్ఞప్తి చేశారు. తొలుత మంత్రి రజిని ఎస్వీఎన్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి జేకేసీ నగర్, వికాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా శేషిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సాంబశివరావు, చలమారెడ్డి, విప్పల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 39వ డివిజన్ పరిధిలో నేతాజీ నగర్, సాయికృష్ణ నగర్ ప్రాంతాల్లో మంత్రి రజిని, కిలారి రోశయ్యలు పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి మార్కెట్ బాబు, డివిజన్ అధ్యక్షుడు షఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు అద్దంకి రాజా, పిల్లుట్ల మోహనరావు, ఖాజావలి, ఉడతా కృష్ణ, ఎస్సీ సెల్ కార్యదర్శి అచ్చిబాబు, యువజన విభాగం కార్యదర్శి డానీ, కృష్ణ, ఖాజా, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గేదెల నాగరమణి, నాయకులు గేదెల రమేష్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టెన్త్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: పది ఫలితాల్లో ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థినులను ప్రిన్సిపాల్ సిస్టర్ కులందై ట్రీజా అభినందించారు. మంగళవారం అమరావతిరోడ్డులోని పాఠశాలలో ఆమె మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు చెప్పారు. కె.స్నేహ (584), డి.ఏంజెల్ జోయ్ (583), సీహెచ్ హాసిని (581), వై.భువనతేజ (580), షేక్ రషీద్ (577), ఎ.భువనశ్రుతి (569), టి.తన్మయ్ (565), డి.దేవకుమారి (562), బి.రుషీక్‌రెడ్డి 562 మార్కులు సాధించారని తెలిపారు.

### విద్యాభివృద్ధికి దాతల చేయూత అభినందనీయం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి దాతలు చేయూత అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని శిల్పారామం సమీపంలోని ఎంవీఎస్ కోటేశ్వరరావు పాఠశాలకు మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ అధ్యక్షుడు కొమ్మాలపాటి (కేఎస్సార్) అధ్యక్షతన డిజిటల్ తరగతుల బోధనకు ఎల్ఈడీ టీవీని అందజేశారు. కొమ్మాలపాటి నేతృత్వంతో వివిధ పాఠశాలలకు టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఉపకార వేతనాలు, ఎల్ఈడీ ప్రొజెక్టర్లు అందజేసినట్లు తెలిపారు. కొమ్మాలపాటి, అంకమ్మ డెవలపర్స్ ప్రతినిధి సీఎంఆర్ కృష్ణ, రమేష్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ముప్పాళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వెలుగులోకి మట్టిలో మాణిక్యాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రతిభావంతులుగా వెలుగులోకి రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని నవీన హైస్కూల్ టెన్త్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ వై.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది హాజరైన 145 విద్యార్థుల్లో 142 మంది ప్రథమ శ్రేణిలోనూ, ముగ్గురు ద్వితీయ శ్రేణిలోనూ ఉత్తీర్ణులయ్యారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ వై.చిన్నమ్మ, హెచ్‌ఎం నవీన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాల్లో సుమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సుమేధ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని పాఠశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా వై. వాసంతి 589 మార్కులు, పి.మోహన్ ప్రీతి (584), వై.రాజ్యలక్ష్మి (578), ఆర్. మనస్వి (560)లతో పాటు 500కు పైగా సాధించిన 36 మంది విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి

## బాకీదారులను బెదిరించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: డబ్బులు అడిగిన బాకీదారులను బెదిరించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన అంజిరెడ్డి చిట్టీ పాటలు నిర్వహిస్తుంటాడు. ఈక్రమంలో పలువురికి పాట డబ్బులు చెల్లించలేదు. మంగళవారం పాటదారులు సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీరశంకరరెడ్డి మరికొందరు అంజిరెడ్డి ఇంటికి వెళ్లి బాకీ డబ్బులు అడిగారు. అంజిరెడ్డి వారిని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం తథ్యం

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- గుంటూరు రూరల్ మండల నేతలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, పక్కన బలసాని

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ తిరుగులేని మెజారిటీతో గెలుపొందడం తథ్యమని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని పార్టీ గుంటూరు రూరల్ మండల ముఖ్యనేతల సమావేశం విస్తృత స్థాయి సమావేశం జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలు రెండు పార్టీలు, ఇద్దరు వ్యక్తులు మధ్య జరిగే సాధారణ ఎన్నికలు కావని, అభివృద్ధి, సంక్షేమానికి – అబద్ధాలు మోసానికీ మధ్య జరుగుతున్న ఎన్నికలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో తమకు ఓటు వేశారా లేదా..? 2024లో వేస్తారా వేయరా..? అని ఏమాత్రం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. ఓవైపు టీడీపీ, బీజేపీ, జనసేనలు కలిసి ముప్పేట దాడి చేసినా.. మరోవైపు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసొచ్చినా.. ప్రజాబలంతో ఒంటరిగా నిలిచిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి కాకుండా ఆపడం ఎవరి తరమూ కాదని తేల్చి చెప్పారు.

**ఎంపీగా రోశయ్య.. ప్రత్తిపాడులో బలసాని గెలుపు ఖాయం**

గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి కిలారి రోశయ్య అత్యంత సమర్థుడైన నాయకుడన్నారు. రోశయ్య గెలుపుతోనే గుంటూరు సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజాసేవ చేయాలన్న తలంపుతో రాజకీయాల్లోకి వచ్చిన బలసాని కిరణ్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు. బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన గెలుపు పేదల గెలుపుగా.. పెత్తందారులపై సాధించిన అతి పెద్ద విజయంగా చరిత్ర సృష్టిస్తుందన్నారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) మాట్లాడుతూ, గుంటూరు రూరల్ మండలం పార్టీకి కంచుకోట అన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గం పరిశీలకుడు అవుతు శ్రీనివాసరెడ్డి, గుంటూరు ఎంపీపీ ఇంటూరి పద్మాఅంజిరెడ్డి, మాజీ ఎంపీపీ లక్కాకుల థామస్ నాయుడు, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు, కార్పొరేటర్లు యేరువ సాంబిరెడ్డి, స్మితపద్మజ, చల్లా రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, బండారి శ్రీను, నూనె వెంకటకోటిరెడ్డి, యోగీశ్వరరెడ్డి, నాగం కాశీ, గోళ్ల శివశంకర యాదవ్, దగ్గుల మల్లికార్జునరెడ్డి, కంది సంజీవరెడ్డి, జిల్లేపల్లి వేణు, కరీముల్లా, జానీ, రామాంజీ, జొన్నలగడ్డ సుబ్బారావు, డైరెక్టర్ పిల్లి మేరీ, శివాలశెట్టి రాధా, నూనె ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్‌కు ప్రభుత్వ వాహనం

- రైల్వే శాఖ వాహనంపై ఊరేగింపుగా వెళ్లిన టీడీపీ తూర్పు నియోజక వర్గ అభ్యర్థి నసీర్ అహ్మద్
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆన్ డ్యూటీ ఎస్.సి. రైల్వే అని స్టిక్కర్ ఉన్న వాహనంపై ఊరేగింపుగా వెళుతున్న నసీర్ అహ్మద్

లక్ష్మీపురం: గుంటూరులో నామినేషన్‌లు వేసేందుకు ఆయా పార్టీలు పోటాపోటీగా ఊరేగింపులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తెలుగు దేశం పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖకు సంబంధించిన ఒక వాహనంలో వెళ్లడం నగరంలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. సోమవారం తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజక వర్గ అభ్యర్థి నసీర్ అహ్మద్ నామినేషన్ దాఖలు చేసేందుకు తూర్పు నియోజకవర్గం నుంచి నగరపాలక సంస్థ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపునకు దక్షిణ మధ్య రైల్వేశాఖ పేరు ఉన్న (ఆన్ గవర్నమెంట్ డ్యూటీస్ సౌత్ సెంట్రల్ రైల్వే ) వాహనాన్ని పూలతో అలంకరించి దానిపై ఊరేగింపు నిర్వహిస్తూ స్థానికులకు అభివాదం చేస్తూ వచ్చారు. దీన్ని గమనించిన స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. మరో వైపు ఎన్నికల అధికారులు నసీర్ ఉపయోగించిన ప్రభుత్వ వాహనాన్ని పట్టించుకోకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

## మత్తు వైద్య విభాగానికి పరికరాలు వితరణ



డాక్టర్ శ్రీనివాస ప్రసాద్‌కు రూ.5లక్షలు విలువగల వైద్య పరికరాలు అందజేస్తున్న జింకానా సభ్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి మత్తు వైద్యవిభాగానికి రూ.5లక్షల విలువ గల వైద్య పరికరాలను జింకానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ త్రిపురనేని రవి అందించడం అభినందనీయమని ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో జింకానా కో-ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కర రావు, డాక్టర్ హనుమంతరావులు వైద్య పరికరాలు మత్తు వైద్య విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ వైద్య పరికరాలు రోగులకు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పారు. వైద్యులకు, పీజీ వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జింకాన సభ్యులు మెడికల్ కళాశాలకు, ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని విధాలా సహాయ పడుతున్నారని, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు. అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ రెమిమో, డాక్టర్ శ్యాంసన్, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### జంగాల అజయ్‌కుమార్ నామినేషన్ దాఖలు

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తానవలి ఉన్నారు. నామినేషన్ అనంతరం సీపీఐ నేత నారాయణ మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీకి రాష్ట్రంలో టీడీపీ, జనసేనలు వంతపాడటం సిగ్గుచేటన్నారు. మతోన్మాద రాజకీయాలకు దేశప్రజలంతా చరమగీతం పాడాలన్నారు. తొలుత స్థానిక వెంకటేశ్వర విజ్ఞానమందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.





## సీహెచ్‌ఓలకు గర్భిణుల ఆరోగ్యంపై శిక్షణ




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, పక్కన డాక్టర్ గిరిధర్

గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (సీహెచ్‌ఓ)లకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కేర్ కంపానియన్‌పై శిక్షణ జరిగింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గర్భిణికి తప్పనిసరిగా బీపీ పరీక్ష చేసి నమోదు చేయాలన్నారు. ప్రతి గర్భిణిని భౌతికంగా పరిశీలించాలని చెప్పారు. ప్రమాదకర గర్భిణులను గుర్తించి, వీలైనంత త్వరగా నమోదు చేసి బీపీ, మధుమేహం, థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. తరచుగా వారి ఆరోగ్యంపై మెలకువగా ఉండాలని, హైరిస్క్ గర్భిణులను ట్యాగ్ చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఎస్‌డీసీ (సేఫ్ డెలివరీ క్యాలెండర్) ప్రదర్శించి కాన్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. శిక్షకులు డాక్టర్ లక్ష్మి సుధా, డాక్టర్ గిరిధర్, వాత్సల్య, భానుశ్రీ, సోప్రతోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.